సాక్షి ప్రకాశం

గురువారం । 5 । డిసెంబర్ । 2024

అంగట్లో ఆడపిల్ల



ఐదుగురు ఆడపిల్లలున్న ఓ పేద కుటుంబం రూ.2 లక్షలు ఇప్పిస్తామన్న మధ్యవర్తి మాటలు నమ్మి పసిబిడ్డను విక్రయించారు. తీరా డబ్బు అందకపోవడంతో తమ బిడ్డను ఇప్పించాలంటూ పోలీసులను ఆశ్రయించారు. - 4లో..



హిందువులపై అకృత్యాలను ఆపాలి

బంగ్లాదేశ్‌లో హిందువులపై అకృత్యాలు ఆపాలని కోరుతూ జిల్లా హిందూ సంఘాల ఐక్య వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. ఆమేరకు నగరంలో ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. - 4లో..

గరిష్టం/కనిష్టం
30/24

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో భూ ప్రకంపనలు

ఒంగోలు టౌన్: జిల్లాలో బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో భూమి స్వల్పంగా కంపించింది. గోపాల్ నగర్, ఇస్లాంపేట, బలరాం కాలనీ, కేశవరాజుకుంట, రామ్‌నగర్, సంతపేట, బండ్లమిట్ట, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించినట్లు ప్రజలు చెబుతున్నారు. ఇళ్లల్లో ఉన్న మంచాలు, అటకపై సామాన్లు కదిలాయని తెలిపారు. రెండు సెకండ్ల పాటు భూమి కంపించింది. జిల్లాలోని మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, దర్శి తదితర ప్రాంతాల్లో ఉదయం గం.5.30 సమయంలో భూమి కంపించింది.

22న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు సిటీ: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఈ నెల 22వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బిల్డింగ్‌లో నిర్వహించనున్నట్లు స్టేట్ సీఈవో పి.శ్రీమన్నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సభ్యులందరూ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని కోరారు.

2,208 హెక్టార్లలో పంట నష్టం

- తుఫాన్‌తో శనగ పంటపై అధిక ప్రభావం



కొమరోలులో చెరువును తలపిస్తున్న శనగ పంట

ఒంగోలు సబర్బన్: ఫెంగల్ తుఫాన్ తాకిడికి జిల్లాలో 2,208 హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. నాలుగైదు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో అడపా దడపా వర్షాలు కురిశాయి. దీని వల్ల వ్యవసాయ శాఖ పరిధిలో దాదాపు 2,198 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, ఉద్యానవన శాఖ పరిధిలో మిర్చి, పూలతోటలు మరో 10 హెక్టార్ల వరకు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రధానంగా శనగ పంటకు నష్టం వాటిల్లింది. మొక్క దశలో ఉండటంతో వర్షాలకు పొలాల్లో నీరు నిలబడి వేరు కుళ్లి పంటకు నష్టం వాటిల్లింది. జిల్లాలో ప్రధానంగా ఫెంగల్ తుఫాన్ తాకిడి పశ్చిమ ప్రకాశంపై చూపింది. కనిగిరి, సీఎస్‌పురం, వెలిగండ్ల, పామూరు, కొమరోలు మండలాల్లోనే ఈ పంట నష్టం సంభవించినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనాలు రూపొందిస్తున్నారు. జిల్లాలో శనగ పంట దాదాపు 1,547 హెక్టార్లలో దెబ్బతింది. 512 హెక్టార్లలో మినుము పంట, 85 హెక్టార్లలో కంది, 54 హెక్టార్లలో వరి, 10 హెకార్లలో మిర్చి, పూలతోటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు ఇంకా పంట నష్టం అంచనాలు రూపొందిస్తున్నారు. పొగాకు పంట ఆలస్యంగా వేసిన పొలాల్లో నీరు నిలబడటం వల్ల కొన్ని ప్రాంతాల్లో నీట మునిగింది. రైతులు అప్రమత్తమై పొలాల్లో నిలబడిన నీళ్లను బయటకు పంపుకున్నారు. దీంతో పొగాకు పంటలో పెద్దగా నష్టం జరగలేదని పొగాకు బోర్డు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు జిల్లా వ్యాప్తంగా అధికారులను అప్రమత్తం చేసి జిల్లాలో పూర్తి స్థాయిలో పంట నష్టం అంచనాలు రూపొందించాలని సిబ్బందిని ఆదేశించారు.

కల్తీపై నో కంట్రోల్!





జిల్లాలో పేదలకు అందించే రేషన్ బియ్యం, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకో పక్క చౌక దుకాణాల నుంచి రేషన్ బియ్యం, కందిపప్పు పక్కదారి పడుతోంది. మార్కెట్లో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వీటన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నియంత్రించాల్సిన ఆహార సలహా కమిటీల ఉనికి కనుమరుగైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరునెలలు కావస్తున్నా కమిటీల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోకపోవడంతో అక్రమాలకు అంతేలేకుండా పోయింది.

- ఆహార సలహా సంఘాల ఊసేలేదు
- కూటమి ప్రభుత్వంలో ఏర్పాటు కాని కమిటీలు
- రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలు
- పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాసిరకం
- అంగన్‌వాడీల్లో అందని పౌష్టికాహారం
- బహిరంగ మార్కెట్లో కల్తీ నియంత్రణ కరువు

మార్కాపురం: పేదలకు బాసటగా నిలిచేందుకు ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు గతంలో బియ్యం, చక్కెర, గోధుమలు, కందిపప్పు, నూనె, గోధుమపిండి ఇచ్చేవారు. వీటి సరఫరా తీరు, నాణ్యత, ఇతర అంశాలను పరిశీలించేందుకు గతంలో ఆహార సలహా సంఘాలు ఉండేవి. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఉన్న కమిటీలు రేషన్ బియ్యం నాణ్యత, పంపిణీ తీరు, స్కూళ్లలో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో సరఫరా అవుతున్న పౌష్టికాహారం తదితర వాటిల్లో నాణ్యతా లోపాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కమిటీలు ఏర్పాటు చేయలేదు. వినియోగదారులకు అందాల్సిన నిత్యావసర వస్తువులు సక్రమంగా లభించటం లేదు. జిల్లా వ్యాప్తంగా 6,76,160 రేషన్‌కార్డులు ఉండగా, 1,392 రేషన్ దుకాణాలు ఉన్నాయి. జిల్లాలో 9500 టన్నుల బియ్యం రేషన్‌కార్డుదారులకు అందిస్తున్నారు. అధికారులను ప్రశ్నించే కమిటీ లేకపోవటంతో నిత్యావసర వస్తువుల పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

మధ్యాహ్న భోజనం నాణ్యత అంతంతే..

జిల్లాలో 2326 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 1,73,314 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో రుచి తగ్గిపోయింది. మెనూ ప్రకారం ఆహారం అందడం లేదు. నాసిరకం కోడిగుడ్లు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మధ్యాహ్న భోజన నాణ్యత రుచి కూడా తగ్గుతున్నట్లు విద్యార్థులే చెప్పడం గమనార్హం. వీటన్నింటికీ చెక్ పెట్టే కమిటీలు ఏర్పాటుకాకపోవడం విచారకరం.

రేషన్ బియ్యం పక్కదారి..

రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. రేషన్ మాఫియాకు పశ్చిమ ప్రకాశం అడ్డాగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా పక్కదారిపడుతున్న రేషన్‌బియ్యం కృష్ణపట్నం పోర్టు, అనంతపురం ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. కూటమి నాయకులైన టీడీపీ, జనసేన నాయకులే బియ్యం అక్రమ రవాణాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇటీవలి కాలంలో కంభం మండలంలోని కందులాపురం, యర్రగొండపాలెం మండలంలోని అమానిగుడిపాడు, సాయినగర్, త్రిపురాంతకంలలో సుమారు 1200 బస్తాలకు పైగా రేషన్‌బియ్యాన్ని మార్కాపురం సబ్‌కలెక్టర్ త్రివినాగ్ పట్టుకున్నారు. మార్కాపురం టౌన్, రూరల్ తదితర ప్రాంతాల్లో కూడా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఇవన్నీ రేషన్ బియ్యం అక్రమాలకు నిలువుటద్దంగా నిలుస్తున్నాయి. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర ఎక్కువగా ఉండడంతో రేషన్ కార్డుల ద్వారా ఇస్తున్న కందిపప్పు 50 శాతం కూడా పంపిణీ చేయకుండా అంతా నల్లబజారుకు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రాజీనామా చేస్తారా... కేసులు నమోదు చేయమంటారా...

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాలతో పాటు యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాల్లోని పలువురు రేషన్ డీలర్లను కూటమి ప్రభుత్వం రాగానే అధికారులు బలవంతంగా రాజీనామా చేయించి కొత్తవారిని నియమించారు. రాజీనామా చేయని డీలర్ల ఇంటివద్దకు వెళ్లి తనిఖీల పేరుతో బెదిరింపులకు పాల్పడి 6ఏ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో ఇప్పటికే మార్కాపురం టౌన్‌లో 24, మండలంలో 49 మంది, తర్లుపాడులో 11 మంది డీలర్లతో రాజీనామా చేయించారు. ఇదే పరిస్థితి యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గంలో కూడా ఏర్పడింది.

ప్రజారోగ్యంతో చెలగాటం..

మార్కెట్లో కల్తీ ఆహారాన్ని పూర్తిగా నియంత్రించేవారే కరువయ్యారు. వినియోగదారులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. మార్కెట్లో లభించే పదార్థాల్లో చాలా వరకూ నాసిరకంగా ఉంటున్నాయి. ఆహార సలహా సంఘాల ఊసేలేకపోవడంతో బహిరంగ మార్కెట్లో నాసిరకం వస్తువులు, కల్తీ ఆహారం ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి.

కమిటీ ఇలా...

సలహా సంఘ కమిటీలో జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్, డీఎస్‌ఓ, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, తహశీల్దార్, డీలర్ ఒకరు, ప్రింట్ మీడియా సభ్యులు, ఎంపీడీఓ, ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన వ్యక్తులు ఉంటారు. వీరందరూ నెలవారీ సమావేశాలు నిర్వహించి కార్డుదారులకు ఇబ్బందులు, తదితర అంశాలపై చర్చించి ప్రత్యేక రిజిస్టర్‌ను తయారు చేయాల్సి ఉంటుంది. పౌరసరఫరా గోడౌన్ నుంచి రేషన్ దుకాణాలకు వచ్చే సరుకుల వివరాలపై సభ్యులకు పూర్తి స్థాయిలో సమాచారం ఉండాలి. ప్రస్తుతం నూతన కమిటీలు ఏర్పాటు చేయకపోవటంతో వినియోగదారుల సమస్యలు అధికారుల దృష్టికి పోవటంలేదు.

అందని పౌష్టికాహారం..

జిల్లాలో 13 అంగన్‌వాడీ ప్రాజెక్టులు, అంగన్‌వాడీ కేంద్రాలు 2,903 ఉన్నాయి. అందులో 6 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 58,388 మంది, ప్రీస్కూల్ పిల్లలు 46,392 మంది ఉన్నారు. ఈ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అరకొరగా అందుతోంది. కందిపప్పు పంపిణీకి బ్రేక్ పడగా, ఇతర సరుకులు సైతం సకాలంలో అందడం లేదు. మరో వైపు రేషన్ డీలర్లు కూడా చేతివాటం చూపిస్తుండడంతో పౌష్టికాహారం అందని ద్రాక్షగా మారుతోంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టగా కూటమి ప్రభుత్వంలో సేవలు మృగ్యమవుతున్నాయి.

నూతన ప్రభుత్వంలో సమావేశాలు లేవు



నూతన కూటమి ప్రభుత్వంలో ఆహార సలహా సంఘ సమావేశాలు ప్రభుత్వం నిర్వహించలేదు. మండలాల్లో కూడా ఇదే పరిస్థితి. దీంతో క్షేత్ర స్థాయిలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లలేకపోతున్నాం. పౌర సరఫరాల శాఖలో ఏం జరుగుతుందో తెలియటం లేదు. ప్రభుత్వం డీసీపీసీ (డిస్ట్రిక్ట్ కన్జూమర్ ప్రొటక్షన్ కమిటీని) వెంటనే సమావేశపరచాలి. వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. పశ్చిమ ప్రకాశంలో బియ్యం అక్రమ రవాణా జరుగుతోంది. వీటిని వెంటనే అరికట్టాలి. ఇలాంటివి చర్చించేందుకు తక్షణమే అధికారులు కమిటీలను నియమించి సమావేశాలు ఏర్పాటు చేయాలి.

– ఓవి మల్లిక్, జిల్లా వినియోగదారుల సంఘ గౌరవ అధ్యక్షుడు

11న వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

- ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఈనెల 11వ తేదీ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నారని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అన్నారు. నగరంలోని డివిజన్ కార్పొరేటర్లు, అధ్యక్షులతో బుధవారం నిర్వహించిన సమావేశానికి నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు మాట్లాడుతూ 11వ తేదీ నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకుమాను రాజశేఖర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే లిక్కర్ షాపుల్లో వాటాలు, ఇసుక రీచ్‌లను టీడీపీ నాయకులు అమ్ముకుంటున్నారని విమర్శించారు. గతంలో కంటే ప్రస్తుతం ఇసుక ధర ఎక్కువగా ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రతి కార్యకర్త వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కష్టపడిన వారికి పార్టీ తప్పకుండా అండగా ఉండి ప్రాధాన్యత కల్పిస్తారన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికే మంచి అవకాశాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దామరాజు క్రాంతికుమార్, కార్పొరేటర్లు ఇమ్రాన్, ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు చావలి శివ, కఠారి ప్రసాద్, వెన్నపూస వెంకటరెడ్డి, రొండా అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కాశిరెడ్డి, సాగర్, నాగుల్‌మీరా, తెళ్ల విక్టర్‌పాల్, కె.కోటియాదవ్, భాస్కర్, జేమ్స్, పూర్ణచంద్రారెడ్డి, రజని, చిన్న, సుధాకర్, పి.కోటేశ్వరరావు, మిరియం వెంకటేశ్వర్లు, కె.సురేష్, రాజేష్, ముల్లంగి రవీంద్రరెడ్డి, రెడ్డి పరమేశ్వర్, అనంతరెడ్డి, చక్రపాణి, లాయర్ హరిబాబు, బడుగు ఇందిర, రవణమ్మ, ప్రసన్న, జి.మేరికుమారి, వి.వాణి,ఆర్.అంకయ్య, వెంకటరామిరెడ్డి, నరాల రమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణ, తిరుమలరెడ్డి, గంగాడ శ్రీనివాస్, జపుల్లా, లీగల్ సెల్ నగరికంటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయంలో చెదలు పట్టిన రికార్డులు

రెవెన్యూ రికార్డులకు చెదలు

- రికార్డుల భద్రతపై అనుమానాలు
- చెదలు పట్టి పట్టుకుంటే ముక్కలు ముక్కలు

సింగరాయకొండ: ఈ ఫొటోలో కనిపిస్తున్నది డంపింగ్ యార్డు అనుకుంటే మీరు పొరబడినట్లే. సింగరాయకొండ రెవెన్యూ కార్యాలయంలో విలువైన రికార్డులు భద్రపరిచిన గది ఇది. ఎన్నో విలువైన రికార్డులు ఉండే ఈ గదిని ఏళ్ల తరబడి అధికారులు పూర్తిగా విస్మరించడంతో రికార్డుల గది డంపింగ్ యార్డును తలపిస్తోంది. దీనికి తోడు రికార్డులన్నీ పూర్తిగా చెదలు పెట్టి పట్టుకుంటే ముక్కలు ముక్కలవుతున్నాయి. గతంలో మండల రెవెన్యూ కార్యాలయం కందుకూరు ఆర్‌డీఓ పరిధిలో ఉండేది. ఆర్‌డీఓ, సబ్‌కలెక్టర్ స్థాయి అధికారులు కార్యాలయానికి వచ్చినప్పుడు రికార్డు గది చూసి ఎన్నోసార్లు అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. కానీ ఎవ్వరూ పట్టించుకోలేదు. ఓ సబ్ కలెక్టర్ అయితే గదిలో రికార్డులను పూర్తిస్థాయిలో భద్రపరిచి, ఆ ప్రక్రియను వీడియో తీసి నాకు పంపించాలని ఆదేశించారు. కానీ అధికారులు ఆ ఆదేశాలను సైతం పట్టించుకోలేదు. ప్రస్తుతం కార్యాలయంలోని రికార్డు గదిని శుభ్రపరిచే కార్యక్రమం ప్రారంభించారు. ఇందుకోసం కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన రికార్డులను ఐరన్ రాక్ లలో సర్దే పని చేపట్టారు. కానీ అప్పటికే రికార్డులకు చెదలు వ్యాపించి విలువైన రికార్డులు ధ్వంసమయ్యాయి. ప్రస్తుతానికి కొన్ని రికార్డులకు చెదలు దులిపి ర్యాక్‌లలో సర్దామని సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం రికార్డు పట్టుకుంటేనే ముక్కలు ముక్కలు అవుతుందని, జాగ్రత్తగా పరిశీలిస్తే తప్ప విలువైన రికార్డు ఏముందో అర్థమవుతుందని రెవెన్యూ అధికారులు వివరిస్తున్నారు.



చెదలు పట్టిన రికార్డులు

అక్రమార్కులకు అడ్డా..

మండలం ఎన్నో ఏళ్లుగా అక్రమార్కులకు అడ్డాగా ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్‌లు ఇక్కడి నుంచి బదిలీ అయినా తాము పనిచేసిన కాలంలో మంజూరు చేసినట్లు నకిలీ స్టాంపులతో సంతకాలు చేసి మరీ ఇంటిపట్టా, డీకే పట్టాలు సృష్టించి అక్రమార్కులు కోట్లాది రూపాయల విలువైన భూమిని ఆక్రమించుకున్న దాఖలాలు కోకొల్లలు. నకిలీ పట్టాలను సృష్టించిన అక్రమార్కులు తమకు భూమిపై హక్కులు కల్పించాలని కోరుతూ కోర్టులను ఆశ్రయించి అధికారులను సైతం కోర్టుల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురి చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈ రికార్డులు ఎంతో ఉపయోగపడతాయి. కానీ రికార్డులన్నీ చెదలు పట్టి పనికిరాకుండా ఉండటంతో ఏదైనా సమస్య వస్తే ఏ విధంగా ముందుకు వెళతారో అధికారులు, సిబ్బందికే తెలియాలి.



రెవెన్యూ కార్యాలయంలో రికార్డుల గది దుస్థితి ఇదీ..

కొన్ని రికార్డులు పాడై పోయాయి

రికార్డు గదిలో రికార్డులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రస్తుతం రికార్డులు ఉన్న గదిని శుభ్రం చేసి వాటిని భద్రపరుస్తున్నాం. ఇప్పటికే రికార్డులు కొన్ని పూర్తిగా చెదలు పట్టి పాడైపోయాయి. కొన్ని రికార్డులైతే పట్టుకుంటే ముక్కలవుతున్నాయి.

– టి.రవి, తహసీల్దార్ సింగరాయకొండ

వైఎస్ జగన్‌ను కలిసిన బూచేపల్లి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శివప్రసాద్‌రెడ్డి రాష్ట్ర స్థాయి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొని జిల్లాలోని పార్టీ పరిస్థితులు, జిల్లా స్థాయి కమిటీలు, పార్టీ అనుబంధ సంఘాల కమిటీల నిర్మాణం, నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాల గురించి చర్చించారు. ఈ నెల 11న రైతు సమస్యలపై జిల్లా స్థాయిలో జరుగు ధర్నాలు, 27 న కరెంట్‌చార్జీలు పెంపునకు నిరసనగా చేసే ధర్నాలు, జనవరి 3వ తేదీ ఫీజు రీయింబర్స్‌మెంట్ లు విడుదల చేయాలని కోరుతూ ధర్నా కార్యక్రమాలు విజయవంతం చేయాలని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోరినట్లు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కూటమి ప్రభుత్వానిది ఆర్థిక దోపిడీ

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్




యర్రగొండపాలెం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక దోపిడీకి పాల్పడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం పేదలకు మాటలతో నీతులు చెప్తూ, చేతులతో వాతలు పెడుతోందని, పేదవారిని ఆర్థిక దోపిడీకి గురిచేస్తూ 6 హామీలను అటకెక్కించిందని విమర్శించారు. అధికారంలోకి వస్తే అర్ధ రూపాయి కూడా విద్యుత్ చార్జీలను పెంచమని కూటమి నాయకులు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత తమ నాలుకను మడతపెట్టేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే రూ.67,237 అప్పులు ప్రజలనెత్తిపై మోపి అదికూడా సరిపోదన్నట్లుగా విద్యుత్ ట్రూ అప్‌చార్జి పేరుతో దాదాపు రూ.18 వేల కోట్లు ఆర్థిక భారాన్ని ప్రజలపై రుద్ది వారు పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని అన్నారు. ఇది తీవ్రమైన ప్రజా వ్యతిరేక చర్య అని అభివర్ణించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పేద దళితులకు 200 యూనిట్ల విద్యుత్ అందించి ప్రతి గడపలో ఆనంద కాంతులను వెలిగించిందని, కూటమి ప్రభుత్వం వారిపై కక్ష సాధింపుగా వ్యవహరిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం 6 నెలల్లో ఇంత అప్పు ఎందుకు చేయాల్సి వచ్చిందో, కరెంటు చార్జీలపై వారిమాట తీరు ఎందుకు మారిందో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యాశాఖను గాలికి వదిలేసిన లోకేష్

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన శాఖను గాలికి వదలివేసి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నాడని తాటిపర్తి అన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యారని, విషపు ఆహారం తిని అస్వస్థతకు గురైన సంఘటనలు రాష్ట్రంలో చోటు చేసుకుంటున్నాయన్నారు. అయినా వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా తనదైన శైలిలో వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం అర్ధ రూపాయి కూడా కేటాయించలేదని, నూతన మెడికల్ కళాశాలలపై దృష్టి పెట్టకుండా కొత్త సీట్లు వదులుకోవడాన్ని చూస్తే విద్యాశాఖపై ఆయనకు ఎంత ప్రేమ ఉందో ఇట్టే అర్థమవుతుందని అన్నారు.

గంజాయి బ్యాచ్ పరార్

సాక్షి ఎఫెక్ట్..



తనిఖీ చేస్తున్న ఒంగోలు టూ టౌన్ సీఐ మేడ శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: 'కూటమి పంథా...మాఫియా దందా' శీర్షికతో మంగళవారం 'సాక్షి' పత్రికలో వచ్చిన కథనానికి పోలీసుల్లో కదలిక వచ్చింది. ఇస్లాంపేట 2వ లైనులో ఒక రిటైర్డ్ ఎస్‌ఐ ఇంటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కొన్నేళ్లుగా బహిరంగంగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడ రాత్రి 7 గంటల నుంచి మొదలుకొని 11 గంటల వరకు గంజాయి విక్రయిస్తున్నారు. ఇక్కడే గంజాయి తాగుతున్నారు. రాత్రంతా రచ్చ చేస్తుండటంతో ఇక్కడి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో మోటా నవీన్ అనే గిరిజన యువకుడిపై దాడి చేసి మూత్రం పోసిన పాత నేరస్తులు కూడా ఇక్కడికి వచ్చిపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. నగరం నడిబొడ్డున గంజాయి బ్యాచ్ తిష్ట వేసినా ఇన్నాళ్లు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎట్టకేలకు 'సాక్షి'లో వచ్చిన కథనంతో పోలీసులు రంగంలోకి దిగారు. టూ టౌన్ సీఐ మేడ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి ఇస్లాంపేట రెండో లైనులో తనిఖీలు నిర్వహించారు. అయితే అప్పటికే గంజాయి బ్యాచ్ పరారయ్యారు.

క్లుప్తంగా

రఘురామ కేసులో ముగ్గురి విచారణ



విచారణకు హాజరై వస్తున్న జీజీహెచ్ వైద్యుడు

ఒంగోలు టౌన్: మాజీ ఎంపీ ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు జీజీహెచ్‌కు చెందిన ఇద్దరు అధికారులు, సిబ్బంది ఒకరు ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎదుట విచారణకు హాజరయ్యారు. జీజీహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజేంద్ర, ఈసీజీ టెక్నీషియన్ నాగరాజు ఉదయం 11 గంటలకు ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎస్పీ తన చాంబర్‌లోకి ఒక్కొక్కరిని పిలిచి 'ఆ రోజు ఏమి జరిగింది' అంటూ ఆరా తీసినట్లు సమాచారం.

బిలాల్ హోటల్లో చోరీ

ఒంగోలు టౌన్: నగర నడిబొడ్డున ఉన్న ఒక హోటల్లో చోరీ ఘటన సంచలనం సృష్టించింది. అద్దంకి బస్టాండ్ సెంటర్లోని బిలాల్ హోటల్లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. హోటల్ వెనక వైపు నుంచి లోపలికి ప్రవేశించిన దొంగలు బీరువాలో దాచిన 2 లక్షల రూపాయల నగదును అపహరించారు. ఈ సెంటర్లో ప్రైవేట్ బస్ ఏజెన్సీలు, పూల కొట్లు ఉన్నాయి. తెల్లవార్లూ జన సంచారం ఉంటుంది. అయినప్పటికీ చోరీ జరగడం గమనార్హం. చోరీ జరిగిన తీరును బుధవారం టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు.

హత్య కేసు కొట్టివేత

ఒంగోలు: సంతమాగులూరు సర్పంచ్ గడ్డం వెంకటరెడ్డి అలియాస్ లిక్కి వెంకటరెడ్డి (సర్పంచ్) హత్యకేసులో నిందితులపై మోపిన అభియోగాలను కొట్టివేస్తూ 7వ అదనపు జిల్లా జడ్జి టి.రాజా వెంకటాద్రి బుధవారం తీర్పునిచ్చారు. 2016 ఏప్రిల్ 10న గడ్డం వెంకటరెడ్డి ఆయన ఇంటివద్దే దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసులో అట్లా చిన వెంకటరెడ్డి, అట్లా చిన శ్రీనివాసరెడ్డి, కత్తి శ్రీనివాసరెడ్డి, తొంట్ల ప్రభాకరరెడ్డి, అట్లా పెద వెంకటరెడ్డి, వీరారెడ్డి, డీ సత్యన్నారాయణరెడ్డిని నిందితులుగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం చార్జిషీటు దాఖలు చేయగా కేసు విచారణ సమయంలో వీరారెడ్డి మరణించారు. 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో వాదనలు పూర్తి కావడంతో నిందితులపై మోపిన అభియోగాలను ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందని పేర్కొంటూ కేసును కొట్టివేశారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకునికి రిమాండ్

పామూరు: ప్రేమ పేరుతో యువతిని మోసగించిన యువకునికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. మండలంలోని రావిగుంటపల్లి గ్రామానికి చెందిన ఎండ్లూరి నితిన్ అనే యువకుడు అదే గ్రామంలోని తమ బంధువుల యువతిని ప్రేమించి వివాహం చేసుకుంటానని నమ్మించి మోసగించాడు. దీనిపై బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నితిన్‌పై కేసు నమోదు చేయగా బుధవారం అతడిని అరెస్టు చేసి కనిగిరి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు నితిన్‌కు కనిగిరి జేఎఫ్‌సీఎం జడ్జి భరత్‌చంద్ర 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

తల్లిని పోషించని కుమారుడిపై బైండోవర్

- తల్లికి భూమిని స్వాధీనం చేసిన అధికారులు



విచారణ చేస్తున్న తహశీల్దార్, ఇతర అధికారులు

జే.పంగులూరు: తల్లి పేరుతో ఉన్న భూమిని తీసుకొని, ఆమెను పోషించని కుమారుడిపై బైండోవర్ చేసి ఆ భూమిని అధికారులు తల్లికి అప్పగించిన సంఘటన బుధవారం బాపట్ల జిల్లా పంగులూరు మండలంలోని కొండమూరు గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన బత్తుల రామకోటి, శేషమ్మ దంపతులకు కుమారుడు బత్తుల శ్రీను ఉన్నాడు. రామకోటి కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. కొండమూరు గ్రామం సర్వే నంబర్ 2-1 లో 31 సెంట్ల భూమి తన కుమారుడు బత్తుల శ్రీను దౌర్జన్యంగా అక్రమించుకొని సాగు చేసుకుంటున్నాడని, తన పోషణ చూడటం లేదని తల్లి బత్తుల శేషమ్మ గత నెల 11 వ తేదీ బాపట్లలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జీ పెట్టుకుంది. ఈ విషయం బుధవారం పంగులూరు మండల తహశీల్దార్ సింగారావు, ఎంపీడీఓ కే స్వరూప రాణి, రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు కొండమూరు గ్రామం వెళ్లి విచారణ చేశారు. అధికారుల విచారణలో బత్తుల శ్రీను తన తల్లికి చెందిన 31 సెంట్ల భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నాడని నిర్ధారించి ఎంసీ 47 ద్వారా అతనిపై బైండోవర్ చేయించారు. శ్రీను అక్రమంగా సాగు చేసుకుంటున్న 31 సెంట్ల భూమిని అర్జీదారు బత్తుల శేషమ్మకు అప్పగించినట్లు తహశీల్దార్ సింగారావు తెలిపారు.

మేఘభ్రంశం.. సుందర దృశ్యం



పెనుగాలికి దూసుకెళ్లినా.. పైరగాలికి హొయలు పోయినా మేఘాల అందం మేఘాలదే! కరిమబ్బులా కమ్మేసి భానుడినే బాహువుల మాటున బంధించగల మేఘాలు.. సంధ్య వేళలో స్థానభ్రంశం చెందుతూ ప్రకృతి కాన్వాస్‌పై అపురూప దృశ్యాలను ఆవిష్కృతం చేశాయి. ఈ చిత్రాలను ఒంగోలులో 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి, ఒంగోలు

అంగట్లో ఆడపిల్ల!



- మధ్యవర్తి మాటలు నమ్మి పసిబిడ్డను విక్రయించిన తల్లిదండ్రులు
- ఐదో సంతానమూ ఆడపిల్ల అయ్యేసరికి సన్నగిల్లిన మమకారం!
- ఒప్పందం ప్రకారం రూ.2 లక్షలు ఇవ్వకపోవడంతో పోలీసుల చెంతకు..
- తమ బిడ్డను తామే పెంచుకుంటాం.. వెనక్కు ఇప్పించాలని వేడుకోలు
- మధ్యవర్తిని అరెస్టు చేసి, బిడ్డను తల్లికి అప్పగించిన పోలీసులు

చీమకుర్తి: వరుసగా ఐదుగురు ఆడపిల్లలయ్యేసరికి ఆ తల్లిదండ్రులకు మమకారం తగ్గిందో.. లేదంటే పోషణ భారమవుతుందని భావించారో కానీ నెలలు కూడా నిండని పసిపాపను ఓ మధ్యవర్తి ద్వారా రూ.2 లక్షలకు విక్రయించారు. తీరా బిడ్డను తీసుకున్న వారు ఇచ్చిన నగదు మధ్యవర్తి ద్వారా చేతికందకపోవడంతో ఆ తల్లిదండ్రులు అడ్డం తిరిగారు. తమ బిడ్డను తమకు ఇప్పించాలని ఒంగోలు పోలీసులను ఆశ్రయించారు. దీంతో చంటిబిడ్డ విక్రయ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. చీమకుర్తి మండలం చంద్రపాడుకు చెందిన బెజ్జం నాగమణికి ఇప్పటికే నలుగురు ఆడపిల్లలు పుట్టారు. వారిలో ఒకరు 5వ తరగతి, రెండో పాప 3వ తరగతి చదువుతున్నారు. మరో ఇద్దరు చిన్న పిల్లలు. ఇంతలో 5వ పాపకు మూడు వారాల క్రితం చీమకుర్తిలోని జవహర్ ఆస్పత్రిలో జన్మనిచ్చింది. అనంతరం పాపకు ఆరోగ్యం బాగోలేక ఒంగోలు జనరల్ ఆస్పత్రిలో వైద్యం కోసం వెళ్లి వస్తుంటే పొదిలికి చెందిన అరుణ అనే మధ్యవర్తి బస్టాండ్‌లో పరిచయమైంది. నాగమణితో మాటామాటా కలిపి ఆమె పేదరికాన్ని అడ్డం పెట్టుకొని సానుభూతి మాటలతో ఆకట్టుకుంది. బాపట్ల వద్ద సబీనా అనే వారికి పిల్లలు లేరని, వారు పెంచుకుంటారని, వారితో డబ్బు ఇప్పిస్తానని చెప్పడంతో నాగమణి అంగీకరించింది. వారం రోజుల తర్వాత డబ్బు తీసుకుని బిడ్డను అప్పగించేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే సబీనా తరపున రజియా అనే మహిళ బిడ్డను తీసుకునేందుకు ముందుకొచ్చింది. రజియాకు ఇద్దరు పిల్లలు పుట్టి చనిపోయారని, రూ.2 లక్షలు ఇస్తుందని నాగమణితో అరుణ బేరం మాట్లాడింది. ఈ క్రమంలోనే చంటిబిడ్డ ఆరోగ్యం పరీక్షించి చూడాలని రజియా, మధ్యవర్తి అరుణ.. పసిబిడ్డను తీసుకుపోయారు. ఒప్పందం ప్రకారం ఇస్తానన్న డబ్బు కాకుండా కేవలం రూ.50 వేలతో సరిపుచ్చారు. ఇక్కడే కథ అడ్డం తిరిగింది. నాగమణి, ఆమె భర్త కలిసి తమ బిడ్డను తమకు ఇవ్వాలని అరుణను గట్టిగా నిలదీసినా ఫలితం కనిపించలేదు. దీంతో తమ బిడ్డను తామే పెంచుకుంటామని, బిడ్డను తిరిగి ఇప్పించాలని నాగమణి, వారి కుటుంబ సభ్యులు ఒంగోలు డీఎస్పీని ఆశ్రయించారు. చీమకుర్తి పోలీసులు రంగంలోకి దిగి విచారించగా చంటిబిడ్డ విక్రయ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అరుణ గతంలో కూడా పసిబిడ్డలను పిల్లలు లేని వారికి విక్రయించేలా మధ్యవర్తిత్వం నెరిపినట్లు పోలీసుల విచారణలో తేలింది. అరుణను అదుపులోకి తీసుకుని, పసిబిడ్డను నాగమణి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చీమకుర్తి ఎస్సై యూవీ కృష్ణయ్య తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



యువకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ దామోదర్

- ఎస్పీ ఏఆర్ దామోదర్
- ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఒంగోలు సిటీ: 'రోడ్డు ప్రయాణాల్లో భద్రతా నియమాలు పాటించడం మీకు సురక్షితం, మీపై ఆధారపడ్డ కుటుంబానికి ఎంతో క్షేమకరం' అని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో మైనర్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మాడిఫైడ్ సైలెన్సర్ బైక్‌లు, సరైన పత్రాలు లేకుండా వెళ్లా పట్టుబడిన యువకులకు ఎస్పీ దామోదర్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ రూల్స్, భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో తరచూ ఎక్కడో ఓ చోట రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకొని వాహనదారులు గాయాలు బారిన, మృత్యువాత పడుతున్నారని, వారిలో యువకులు/మైనర్లే అధికంగా ఉంటున్నారని తెలిపారు. బాధ్యతా రాహిత్యంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సైబర్ క్రైమ్‌లో బాధితులైతే టోల్ ఫ్రీ నంబర్ 1930 లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హితబోధ చేశారు. ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవాటు చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఆర్ ఎస్సైలు అస్లాం, మాల్యాద్రి, సిబ్బంది ఉన్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు

- ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



దెబ్బతిన్న కారును పరిశీలిస్తున్న ఎస్సై

కొమరోలు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన కొమరోలు మండలంలోని పామూరుపల్లె గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. అమరావతి-కడప రాష్ట్రీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కారు పామూరుపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులు కడపకు చెందిన వారు కాగా శ్రీశైలం వెళ్తుండగా ప్రమాదం సంభవించింది. సంఘటనా స్థలాన్ని ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టైరు పేలి.. డివైడర్‌ను ఢీకొని..



ఒంగోలు : ప్రమాదంలో నుజ్జయిన కారు

ఒంగోలు టౌన్: రన్నింగ్‌లో ఉన్న కారు టైరు పేలడంతో అదుపు తప్పి డివైడర్‌పై ఉన్న చెట్టును ఢీకొన్న సంఘటన ఒంగోలు నగరంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఒంగోలులోని మంగమూరు రోడ్ జంక్షన్ నుంచి సౌత్ బైపాస్ వైపు వెళ్తున్న కారు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్-1 మూల మలుపు వద్దకు రాగానే టైరు పేలింది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి బెలూన్లు ఓపెన్ కావడంతో కారులో ఉన్న నలుగురూ స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద సమయంలో కారులో ఓ డాక్టర్ కూడా ఉన్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



మృతుడు కమల్‌రాజ్ (ఫైల్)



వైద్యశాలలో రోదిస్తున్న తల్లి

కంభం: అనారోగ్యంతో ఆరేళ్లుగా మంచానపడిన తండ్రి బాగోగులు చూస్తున్న కుమారుడిని విద్యుత్ తీగలు యమపాశాలై బలితీసుకోవడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ సంఘటన బుధవారం మండలంలోని చిన్నకంభం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. చిన్నకంభం గ్రామానికి చెందిన మున్నంగి ప్రకాష్‌రావుకు ఆరేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. అతనికి ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. చిన్న కుమారుడు కమల్ రాజ్(19)బేస్తవారిపేటలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతూ గ్రామంలోనే టెంట్ హౌస్‌లో పనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం కంభం బస్టాండ్ సమీపంలో ఓ ఫంక్షన్‌లో టెంట్ హౌస్, లైటింగ్ పనులు చేస్తున్నాడు. ఇనుప స్టాండ్‌పై నిల్చుని వైరింగ్ కనెక్షన్ ఇస్తూ విద్యుత్ షాక్‌కు గురై కింద పడ్డాడు. వెంటనే అతన్ని సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. చేతికొచ్చిన కుమారుడు ఆస్పత్రిలో విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి ఆ తల్లి కుప్పకూలిపోయింది.

విపత్తులను సమర్థంగా ఎదుర్కోవాలి

- రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ

ఒంగోలు అర్బన్: విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని వేళలా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర హోం మంత్రి అనిత సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను త్వరలో పంపుతామని చెప్పారు.

జిల్లాలో 298 గ్రామాల్లో రీసర్వే పూర్తి

జిల్లాలోని 826 రెవెన్యూ గ్రామాలకుగాను 298 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయినట్లు రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలియజేశారు. బుధవారం రెవెన్యూ మంత్రి వీడియో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ పాల్గొన్నారు. ఈ నెల 6 నుంచి రెవెన్యూ సదస్సులను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. అనంతరం కలెక్టర్ జిల్లాకు సంబంధించిన అంశాలను మంత్రికి వివరించారు. భూ సమస్యలపై 8889 అర్జీలు రాగా, సర్వేపై 6283 ఉన్నాయని తెలిపారు. కనిగిరి డివిజన్‌లో 4 మండలాల్లో ఎక్కువ అర్జీలు వచ్చినట్లు వివరించారు. సమస్యలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో రెండు రోజులపాటు సదస్సులు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. డీఆర్‌ఓ చిన ఓబులేసు, కలెక్టరేట్ భూ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై అకృత్యాలు ఆపాలి

- కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపిన హిందూ సంఘాల ఐక్యవేదిక

ఒంగోలు అర్బన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలను ఆపాలని, ఇస్కాన్ సన్యాసి చిన్మయ్ కృష్ణదాస్‌ను జైలు నుంచి విడుదల చేయాలని జిల్లా హిందూ సంఘాల ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక సంఘాల సభ్యులు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై అత్యంత క్రూరంగా దాడులు చేయడం, ఆలయాలపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దోపిడీలకు పాల్పడటం అత్యంత దారుణమన్నారు. ఈ అకృత్యాలు ఆపేందుకు చర్యలు తీసుకోకుండా బంగ్లాదేశ్‌లోని ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించడాన్ని తప్పుబట్టారు. భారత ప్రభుత్వం కల్పించుకుని హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్, హైందవ ధర్మం, బీజేపీ నాయకులు సోమా సుబ్బారావు, మల్లికార్జున రావు, సీతారామయ్య, బాజి, యోగయ్య యాదవ్, శివారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న హిందూ సంఘాల ప్రతినిధులు

అంతు చూస్తా.. మీ కథ తేలుస్తా..!

కురిచేడు రెవెన్యూ సిబ్బందిపై టీడీపీ కార్యకర్త తిట్లదండకం

- తహసీల్దార్ రజనీకుమారితోనూ దురుసు ప్రవర్తన
- మండల మేజిస్ట్రేట్ ఫిర్యాదుపై స్పందించని పోలీసులు
- ఆర్డీఓతోపాటు జిల్లా ఉన్నతాధికారుల వద్దకు చేరిన పంచాయితీ

కురిచేడు: రెవెన్యూ కార్యాలయ సిబ్బందిపై ఓ టీడీపీ కార్యకర్త చిందులు తొక్కుతూ బూతు పురాణం వల్లెవేయడమే కాకుండా మండల మేజిస్ట్రేట్ అయిన తహసీల్దార్‌తో అంతే దురుసుగా మాట్లాడిన తీరు సంచలనంగా మారింది. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఫిర్యాదు చేసినా ఎస్సై స్పందించకపోవడం విమర్శలకు తావిచ్చింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం టీడీపీ కార్యకర్త షేక్ హసన్‌మియా రెవెన్యూ కారాయలయానికి వెళ్లాడు. విధుల్లో ఉన్న సిబ్బందిని దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో ఆర్ఐ నాగరాజు, ఇతర సిబ్బంది కలిసి తహసీల్దార్ జి.రజనికుమారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై తహసీల్దార్ బుధవారం విచారణ చేపట్టారు. అదే సమయంలో తహసీల్దార్ చాంబర్‌లోకి వెళ్లిన టీడీపీ కార్యకర్త హసన్‌మియా.. 'నువ్వెవరు, ఇక్కడ ఎందుకు కూర్చున్నావ్' అంటూ దురుసుగా మాట్లాడాడు. తహసీల్దార్ అందించిన సమాచారంతో పోలీసులు వచ్చి హసన్‌ను బయటకు తీసుకెళ్లారు. విధులకు ఆటంకం కలిగించి, సిబ్బందిని దూషించిన హసన్‌మియాపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎస్సైకి ఫిర్యాదు పంపినా తీసుకోకపోవడంతో ఆర్డీఓ, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. అయితే మండల టీడీపీ నాయకులు తహసీల్దార్‌తో చర్చలు జరిపి హసన్‌మియాతో క్షమాపణ చెప్పించినా ఆమె అంగీకరించలేదని సమాచారం.

అడాస్ ఫీచర్స్‌తో 'అమేజ్ త్రీజెన్'



ఒంగోలు సిటీ: ప్రస్తుత మార్కెట్, వినియోగదారుల అభిరుచులకు తగినట్లుగా హోండా సంస్థ సేఫ్టీ అడాస్(అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టం) ఫీచర్స్‌తో రూపొందించిన నూతన అమేజ్ త్రీజెన్‌ను మార్కెట్‌లోకి బుధవారం విడుదల చేసినట్లు డాక్టర్ ఎస్‌వీ కృష్ణారావు, ఒంగోలు బ్రాంచ్ హెడ్ సందీప్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమేజ్ త్రీజెన్ కారు వీ/వీఎక్స్/జెడ్ఎక్స్ వేరియంట్లలో లభిస్తుందని పేర్కొన్నారు. కారు ఎక్స్ షోరూం ధర మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ మోడల్ రూ.7,99,900 నుంచి రూ.9,19,900, సీవీటీ రూ.9.69 లక్షల నుంచి రూ.10,89,900గా ఉందని వివరించారు. షోరూమ్‌లో బుకింగ్స్ ఓపెన్ చేసినట్లు వెల్లడించారు.

ప్రశాంతంగా రైల్వే యూనియన్ ఎన్నికలు



పోలింగ్ బాక్సుల వద్ద పోలీసు బందోబస్తు

మార్కాపురం టౌన్: రైల్వేశాఖలోని ప్రధాన యూనియన్ల మధ్య ఎన్నికలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం మార్కాపురం రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మార్కాపురం, కంభం, తర్లుపాడు, గజ్జలకొండ, దొనకొండ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 292 ఓట్లు ఉండగా 140 మంది ఉద్యోగులు బుధవారం జరిగిన పోలింగ్‌లో ఓటు వేశారు. గురువారం కూడా పోలింగ్ కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్, ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్ మజ్దూర్ యూనియన్, సౌత్ సెంట్రల్ ఎంప్లాయీస్ సంఘ్, సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ల మధ్య పోటీ జరుగుతోంది. కాగా రైల్వే ఏఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.